సాక్షి అనకాపల్లి

7

మంగళవారం ၊ 18 ၊ మార్చి ၊ 2025

పది పరీక్షలు ప్రారంభం



అనకాపల్లిలో టెన్త్ పరీక్షల నిర్వహణను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్



దేవరాపల్లి పరీక్ష కేంద్రానికి మానసిక దివ్యాంగురాలైన కుమార్తె పెంటకోట శాంతిని తీసుకువచ్చిన దేవి

తుమ్మపాల: జిల్లావ్యాప్తంగా సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొత్తం 21,162 మంది రెగ్యులర్ విద్యార్థులకు గాను 20,967 మంది హాజరయ్యారని, 195 మంది గైర్హాజరయ్యారని డీఈవో జి.అప్పారావునాయుడు తెలిపారు. ఓపెన్ పదో తరగతి పరీక్షార్థులు 211 మందిలో 45 మంది గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు. కలెక్టర్ విజయ కృష్ణన్ ఎన్టీఆర్ ఆస్పత్రి వద్ద గల భాష్యం పాఠశాల పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. పరీక్షలకు విద్యార్థులందరూ హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని, అందుకు సంబంధించి మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులకు తగు సూచనలు జారీ చేయాలని జిల్లా విద్యాశాఖాధికారిని ఆమె ఆదేశించారు.

పరీక్ష రాసిన దివ్యాంగులు

దేవరాపల్లి: దేవరాపల్లి హైస్కూల్‌లోని పరీక్ష కేంద్రంలో ముగ్గురు విద్యాంగ విద్యార్థులు తల్లిదండ్రుల సహాయంతో పరీక్షలకు హాజరయ్యారు. సహాయకులతో పరీక్షలు రాసేందుకు ఉన్నతాధికారులు వీరికి అవకాశం కల్పించారు. కాశీపురం హైస్కూల్లో చదువుతున్న చంద్రయ్యపేటకు చెందిన మానసిక దివ్యాంగులు సిమ్మ దుర్గమ్మ, సిమ్మ గౌరిలను తల్లిదండ్రులు తీసుకువచ్చారు. కలిగొట్ల హైస్కూల్‌కు చెందిన మానసిక దివ్యాంగురాలైన పెంటకోట శాంతిని ఆమె తల్లి దేవి స్వగ్రామం బోయిలకింతాడ నుంచి తీసుకువచ్చారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహర్
	మంగళ	బుధ
అనకాపల్లి	6.12	4.47
నర్సీపట్నం	6.14	4.45

ఉపమాక హుండీ ఆదాయం రూ.29.57 లక్షలు

నక్కపల్లి: ప్రాచీన పుణ్యక్షేత్రం ఉపమాక వేంటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.29 లక్షలు లభించిందని టీటీడీ ఏఈవో జగన్మోహన్ తెలిపారు. సోమవారం హుండీలను లెక్కించామని, 28 రోజులకు గాను హుండీల్లో భక్తులు వేసిన కానుకల రూపంలో రూ.29 లక్షల 57 వేలు ఆదాయం లభించిందన్నారు. లడ్డూల అమ్మకం ద్వారా రూ.5 లక్షలు లభించిందన్నారు. శ్రీవారి సేవకుల ద్వారా హుండీలను లెక్కించామన్నారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కూర్మేశ్వరరావు, దేవస్థానం ప్రధానార్చకులు వరప్రసాదాచార్యులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ప్రత్యేక అధికారులు గ్రామాలను దత్తత తీసుకోవాలి

- కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: ప్రత్యేక అధికారులు స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం అమలుకు ఒక గ్రామం చొప్పున దత్తత తీసుకొని ఆదర్శంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల స్థాయి సమన్వయ కమిటీలు, స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం అజెండా అమలుపై నియోజకవర్గ, మండల, మునిసిపాలిటీల ప్రత్యేక అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం, గ్రామాలలో పరిశుభ్రతపై రానున్న మూడు వారాలలో ప్రత్యేక అధికారులు దృష్టి పెట్టాలన్నారు. అచ్యుతాపురం మండలం ఎం.జగన్నాథపురం గ్రామాన్ని తాను దత్తత తీసుకున్నట్లు తెలిపారు. ప్లాస్టిక్ వినియోగాన్ని ఇంటి నుంచే కట్టడి చేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మునిసిపాలిటీల పరిధిలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. జేసీ జాహ్నవి, డీఆర్వో సత్యనారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

అరకు వరకే కిరండూల్ పాసింజర్

తాటిచెట్లపాలెం: భద్రతా పనుల నిమిత్తం విశాఖపట్నం-కిరండూల్-విశాఖపట్నం(58501/58502) పాసింజర్ ఏప్రిల్ 2వ తేదీ నుంచి 10వ తేదీ వరకు అరకు స్టేషన్ వరకు మాత్రమే రాకపోకలు సాగిస్తుందని వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. ఈ తేదీల్లో అరకు-కిరండూల్ మధ్య ఈ పాసింజర్ నడవదని పేర్కొన్నారు.

విశాఖకు ఆగ్నేయ దేశాల బౌద్ధ పర్యాటకులు



విశాఖలో బౌద్ధ క్షేత్రంలో విదేశీ బౌద్ధ పర్యాటకులు

విశాఖ సిటీ: ఆగ్నేయ దేశాల నుంచి బౌద్ధ పర్యాటకుల తొలి బ్యాచ్ విశాఖకు చేరుకుంది. సోమవారం వీరిని కలెక్టర్ హరేందిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్‌లు స్వాగతం పలికారు. ఆంధ్రప్రదేశ్ టూరిజం ఫోరం అధ్యక్షుడు విజయ్‌మోహన్ ఆధ్వర్యంలో ఈ పర్యాటక బృందం బావికొండ, తొట్లకొండ, పావురాలకొండ, బొజ్జన్నకొండలను సందర్శించింది. ఇక్కడి నుంచి థాయ్‌లాండ్, మలేషియా, సింగపూర్‌లకు విమాన సర్వీసులు ఉండడంతో రాష్ట్ర ప్రభుత్వం ఆగ్నేయ దేశాల పర్యాటకులే లక్ష్యంగా ఇన్‌బౌండ్ టూరిజంకు శ్రీకారం చుట్టింది.

నాలుగుసార్లు తిరిగాను..



మా గ్రామంలో ఏపీఐఐసీ వారు సేకరించిన భూముల్లో మాకు చెందిన 16.94 సెంట్లు కూడా ఉంది. ఈ భూమిలో షెడ్, నీలకుండీ, జీడి చెట్లు ఉన్నాయి. వీటికి నష్టపరిహారం ఇవ్వలేదు. ఈ సమస్యలను పరిష్కరించాలని ఇప్పటికి నాలుగు సార్లు కలెక్టరేట్‌లో దరఖాస్తు చేసుకున్నాను. అయినా ఫలితం లేదు. మళ్లీ దరఖాస్తు చేసుకోవడానికి వచ్చాను.

– జంపన పెద లక్ష్మణ్ రాజు, పెదతీనార్ల, నక్కపల్లి మండలం

8 నెలలుగా వేడుకుంటున్నా..



మా ఇంటి పక్కన్న ఉన్న డ్రైనేజీని మరొకరు మూసివేశారు. దీంతో తీవ్ర దుర్వాసన వస్తుంది. ఈ సమస్యను పరిష్కరించమని గత 8 నెలలుగా ఎంపీడీవోకు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. దీంతో కలెక్టర్ గారికి ఫిర్యాదు చేయడానికి వచ్చాను. రెండు గంటల నుంచి వేచి ఉన్నాను. మాలాంటి వికలాంగుల కోసం కలెక్టర్‌ను కలిసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి.

– కొచ్చెర్ల ఉమామహేష్, మర్రివలస, కె.కోటపాడు మండలం

సర్వే చేయండి ప్లీజ్



నా భర్త చేపూరి సముద్రాలు పేరు మీద ఖాళీ స్థలం ఉంది. ఆ స్థలంలో సర్వే చేసి హద్దులు చూపించమని పలు దఫాలుగా దరఖాస్తులు చేసుకొని గత కొంత కాలంగా తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు. ఇకనైనా మా భూమిని సర్వే చేసి హద్దులు చూపించగలరని కోరుతున్నాము.

-చేపూరి లక్ష్మి, లక్కవరం, యలమంచిలి మండలం

ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని మోసం



నా కుమారుడు ఇంటి రాకేష్ డిగ్రీ పూర్తిచేశాడు. గాజువాకలో పెదగంట్యాడ బీసీ కాలనీకి చెందిన దుంగి దౌపది ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తానని రూ.8 లక్షలు కాజేసిం ది. పోలీసులకు ఫిర్యాదు చేసినా ఆమె వారిని మ్యానేజ్ చేస్తోంది. గతంలో రెండుసార్లు కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాల్లో ఫిర్యాదు చేశాం. అప్పుడు రావికమతం ఎస్ఐ పిలిపించి మాట్లాడారు. తరువాత దాని గురించి పట్టించుకోలేదు. కూలీ నాలీ చేసుకుని సంపాదించిన డబ్బులవి. నా కుమారుడికి ఉద్యోగం వస్తుందన్న ఆశతో ఆ డబ్బంతా ఇచ్చేశాను. కలెక్టర్ గారికి ఫిర్యాదు చేశాను. న్యాయం చేస్తామన్నారు.

- ఇంటి భాగ్యవతి, మత్స్యపురం గ్రామం, రావికమతం మండలం

లెక్కలు సరే.. తిప్పల మాటేమిటి?



హాజరైన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, జిల్లా అధికారులు

ఒక్కొక్కరిదీ ఒక్కో సమస్య.. భూ వివాదం, ఇంటి సమస్య, దారి సమస్య, భూ సర్వే, అందని పింఛన్, ఉద్యోగాల పేరిట మోసం, పాసు పుస్తకం కోసం మామూళ్లు వసూలు.. ఇలా వందలు, వేల ఫిర్యాదులతో బాధితులు కలెక్టరేట్ మెట్లు ఎక్కుతున్నారు. అధికారుల లెక్కలు చూస్తే సమస్యలు ఇట్టే పరిష్కారమైనట్టు కనిపిస్తోంది. కానీ క్షేత్ర స్థాయిలో చాలా సమస్యలు బాధితులను వేధిస్తూనే ఉన్నాయి. 'సాక్షి' బృందం సోమవారం పలువురు అర్జీదారులను పలకరించింది.



అర్జీదారుల సమస్యలు ఆలకిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్, జాయింట్ కలెక్టర్ జాహ్నవి

ప్రజా సమస్యల అపరిష్కృత వేదికగా పీజీఆర్ఎస్

తమ పరిధిలో లేదని చెప్పినా.. పరిష్కరించినట్లే!

క్షేత్రస్థాయిలో మాత్రం పరిష్కారం శూన్యమే..

రెవెన్యూ పరిధిలోనే అత్యధిక ఫిర్యాదులు

సాక్షి, అనకాపల్లి:

ఉన్నతాధికారులకు తమ గోడు చెప్పుకుంటే బాధ తీరుతుందని సామాన్య ప్రజలు ఆశిస్తారు. సోమవారం కలెక్టర్ సహా జిల్లా అధికారులు స్వయంగా తమ అర్జీలు స్వీకరిస్తారు కాబట్టి ఇక తమ కష్టం తీరినట్టేనని భావిస్తారు. ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) పనితీరుపై నిరంతరం సమీక్షలు జరుగుతున్నాయి. కానీ ఆశించిన రీతిలో బాధితులకు పరిష్కారం లభించడం లేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక జూన్ నుంచి ఇప్పటి వరకు 45,346 ఫిర్యాదులు రాగా వీటిలో 42 వేల అర్జీలను క్లోజ్ చేసినట్టు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. 'క్లోజ్' చేయడమంటే పరిష్కరించినట్టేనా?.. ఈ ప్రశ్నకు అధికారులే బదులివ్వాలి. 'ఈ సమస్య మా పరిధిలో లేదు' అని కొన్ని అర్జీలకు సమాధానం ఇస్తారు. వాటిని కూడా పరిష్కరించినట్టే భావిస్తే.. ఇక సామాన్యుల సమస్యలు తీర్చేదెవరు?

కలెక్టర్, ఆర్డీవోల ఆదేశాలు బేఖాతర్

ఫిర్యాదులను తక్షణం పరిష్కరించాలని అక్కడికక్కడే సంబంధిత శాఖాధికారులకు, మండల స్థాయి అధికారులకు కలెక్టర్ తదితర ఉన్నతాధికారులు ఆదేశాలిస్తున్నారు. అయితే ఆదేశాలు అమలు చేస్తున్నారా లేదా అని పరిశీలించే వ్యవస్థ లేకపోవడంతో.. బాధితులు పలుమార్లు తిరగాల్సి వస్తోంది. ఒకే సమస్యపై నెలల తరబడి పీజీఆర్ఎస్‌లో పదే పదే ఫిర్యాదులు చేస్తున్నవారు ఎందరో ఉన్నారు. అర్జీలు ఇవ్వడానికి వచ్చిన బాధితులను ఎవరిని కదిలించినా.. తీవ్ర ఆవేదన వ్యక్తమవుతోంది. సమస్యలను పరిష్కరించినట్లు అధికారులు ఆన్‌లైన్‌లో చూపిస్తున్నారని, సగానికి పైగా అర్జీలను ఆన్‌లైన్‌లో అసలు నమోదే చేయడం లేదని మరి కొంతమంది వాపోతున్నారు. కలెక్టర్, ఆర్డీవో స్థాయి అధికారులు జారీ చేసే ఆదేశాలను క్షేత్ర స్థాయిలో పట్టించుకోవడంలేదని బాధితులు ఆరోపిస్తున్నారు.



దివ్యాంగుడి నుంచి అర్జీ స్వీకరిస్తున్న అధికారి

వెల్లువగా వినతులు.. అరకొర పరిష్కారం..

జిల్లాలో జూన్ నెల నుంచి నేటి వరకూ 45,346 ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో 42,237 ఫిర్యాదులను క్లోజ్ చేసినట్లు, 3,109 ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారుల గణాంకాలు తెలుపుతున్నాయి. అయితే ఫిర్యాదు చేసిన బాధితులు మాత్రం తమ సమస్యలు పరిష్కారం కావడంలేదని, తాము ఇచ్చిన ఫిర్యాదుకు ఆయా సంబంధిత అధికారి ఫోన్ చేసి మీ సమస్య పరిష్కార యోగ్యమైనది కాదు..అని ఏదో ఒక కారణం చెప్పి వివరణ మాత్రమే ఇస్తున్నారని చెబుతున్నారు. అలాంటి కేసులను కూడా క్లోజ్ చేసినట్లు చూపుతున్నారని, వచ్చిన ఫిర్యాదుల్లో పరిష్కారమైనవి సగం కూడా లేవని బాధితులు వాపోతున్నారు.

సోమవారం 340 వినతులు

సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్ విజయ కృష్ణన్, జేసీ ఎం.జాహ్నవి, డీఆర్వో వై.సత్యనారాయణరావు, కేఆర్‌సీపీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్‌వీఎస్ సుబ్బలక్ష్మి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజల నుంచి వివిధ సమస్యలపై 340 వినతులు అందాయి. వాటిలో రెవెన్యూ శాఖకు చెందినవి 209 ఉండగా, పోలీసు శాఖ 23, పంచాయతీరాజ్ శాఖ 27, సర్వే సెటిల్ మెంట్ 11, హౌసింగ్ 10, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం 8, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ 5, కార్పొరేషన్ 5, రూరల్ డెవలప్‌మెంట్‌కు సంబంధించినవి 10 ఫిర్యాదులున్నాయి. అలాగే ఇతర విభాగాలకు సంబంధించి 33 వినతులు వచ్చాయి.

కాళ్లరిగేలా తిరిగినా..



నా వయసు 76 సంవత్సరాలు. మా భూమిని ఎప్పటి నుంచో సాగు చేసుకుంటున్నాం. వృద్ధాప్యంలో ఒంటరిగా జీవిస్తున్న నా భూమిని ఆక్రమించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారు. వారిపై చర్యలు తీసుకోమని రెండు నెలలుగా కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నాను. కలెక్టరమ్మ ఆదేశించినా మండలంలోని అధికారులు నాకు న్యాయం చేయలేదు. అందుకే మళ్లీ ఫిర్యాదు చేయడానికి వచ్చాను.

- చెన్నా సత్యవతి, చిన్నగుమ్మలూరు, ఎస్.రాయవరం మండలం

పాసు పుస్తకం ఆన్‌లైన్ చేయాలి



పట్టాదారు పాసు పుస్తకాన్ని ఆన్‌లైన్ చేయాలని కోరుతూ పీజీఆర్ఎస్‌లో వినతి అందించాను. నిరుపేద దళితులమైన మాకు 1998లో తుమ్మపాల సర్వే నెం.708-1లో ఒక ఎకరం భూమి డీపట్టా మంజూరు చేశారు. జీడీ మామిడి తోటలు సాగుచేసుకుని జీవిస్తున్నాం. నా పేరున పట్టాదారు పాసుపుస్తకం కూడా మంజూరు చేశారు. దీని ఆధారంగా ఆన్‌లైన్ చేసి డిజిటల్ పుస్తకం మంజూరు చేయాలని కోరాను.

-వెలుసూరి ప్రకాశరావు, తుమ్మపాల, అనకాపల్లి మండలం

పింఛన్ తొలగించారు..



నా కుమారుడు ఆదాయ పన్ను కడుతున్నాడని నాకు పింఛన్ తొలగించారు. అతనికి వివాహమై ఇప్పుడు వేరుగా జీవిస్తున్నాడు. ఇప్పుడు నా కుమారుడు కూడా ఆదాయ పన్ను పరిధిలో లేడు. పైగా వేరుగా జీవిస్తున్నాడు. అందువల్ల దివ్యాంగుడనైన నా మొర ఆలకించి, పింఛన్ పునరుద్ధరించవలసిందిగా కలెక్టరేట్‌లో వినతి పత్రం సమర్పించాను.

-జెట్టి సత్యారావు, పరశురాంపేట, అనకాపల్లి

పాసు పుస్తకం కోసం డబ్బులు అడిగారు..



మాకు గునిపూడి రెవెన్యూ పరిధిలో సర్వే నెం.44-5లో 0.45 సెంట్ల భూమి ఉంది. నా భర్త ఏడాది 3 నెలల క్రితం చనిపోయాడు. ఆ భూమిని నా పేరు మీదకు మార్చుకునేందుకు కాళ్లరిగేలా రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాను. నా పేరు మీదకు మార్చుకోవడానికి మ్యుటేషన్ పెడితే.. అది చెల్లదని వీఆర్వో చెప్పారు. డబ్బులు ఇస్తేనే పని అవుతుందంటున్నారు. పేదరాలిని.. ఇచ్చుకోలేనని చెబితే ఇప్పటికీ పని చేయడం లేదు. స్థానిక ఎమ్మార్వో కార్యాలయంలో ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదు. కలెక్టర్ గారికి అర్జీ ఇచ్చాను.

- వానపల్లి సత్యవతి, గునిపూడి గ్రామం, నక్కపల్లి మండలం


ఆక్రమణదారుడికి రెవెన్యూ అధికారుల వత్తాసు



చేతమెట్ట గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెం.292లో 4.10 ఎకరాల అసైన్డ్ భూమిని 1975లో నా భర్త కట్టా కొండయ్యకు ప్రభుత్వం డి-ఫారం పట్టా మంజూరు చేసింది. ఆయన మరణాంతరం నాకు, నా కుమారుడికి స్వాధీన అనుభవ హక్కు ఉంది. అయితే లాలంకోడూరుకు చెందిన మోతుబరి రైతు లాలం గణేష్ ఆర్థిక, రాజకీయ బలంతో రాంబిల్లి రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై 1 బి అడంగల్‌లో ఆ భూమిని తన తండ్రి పేరున నమోదు చేసుకుని ఆక్రమిస్తున్నాడు. దీనిపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదు. వీఆర్వో రూ.లక్షా 50 వేలు లంచం తీసుకుని మోసం చేశాడు. ఆర్‌టీఐ యాక్టు ప్రకారం విచారించి వీఆర్వోపైన, అతనికి సహకరించిన రెవెన్యూ అధికారులపైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.

-కట్టా ఆదమ్మ, ఆమె కుమారుడు, లాలం కోడూరు, రాంబిల్లి మండలం

మైనింగ్ మాఫియా వికృత రూపం



మీడియాతో మాట్లాడుతున్న బొడ్డేడ ప్రసాద్



క్వారీ లారీల యాజమానులు, డ్రైవర్ల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రావణి

- రైల్వే అండర్ బ్రిడ్జి ప్రమాదానికి ఇదే సంకేతం
- తక్షణమే అధికారులు చర్య తీసుకోవాలి
- వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ డిమాండ్

అనకాపల్లి టౌన్: కూటమి పాలనలో మైనింగ్ అక్రమ రవాణా రోజురోజుకు పెరిగిపోతోందని, దీనిపై తక్షణమే జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ డిమాండ్ చేశారు. విజయరామరాజుపేట రైల్వే అండర్ బ్రిడ్జిని క్వారీ లారీ ఢీకొట్టిన ప్రదేశాన్ని వైఎస్సార్ సీపీ నాయకులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా బొడ్డేడ మాట్లాడుతూ పగలు, రాత్రి తేడా లేకుండా మండలం నుంచి నిత్యం అధిక లోడ్‌తో క్వారీ లారీలు వెళుతున్నాయన్నారు. నెలకు 15 లక్షల టన్నుల రాయి రాంబిల్లికి రవాణా అవుతోందన్నారు. కూటమి పెద్దలు నిర్వహిస్తున్న మాఫియాకు అడ్డు అదుపు లేకుండా పోయిందని, ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి మరీ వ్యాపారం చేస్తున్నారని విమర్శించారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు.

తెల్లవారుజామున పెద్దగా జనసంచారం లేని సమయంలో గూడ్స్ ట్రైన్ వెళ్లబట్టి పెద్ద ప్రమాదం తప్పిందని, అదే ఏదైనా ఎక్స్‌ప్రెస్ వెళితే భారీ మూల్యం చెల్లించుకోవలసి వచ్చేదన్నారు. మైనింగ్ దందాపై స్వయంగా స్థానిక అధికార పార్టీ శాసన సభ్యులు ఫిర్యాదు చేసినా అధికార యంత్రాంగం కనీస చర్యలు తీసుకోలేదంటే.. ఈ వ్యాపారంలో పెద్దలు ఉన్నారనేది స్పష్టమవుతోందన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్ , పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు-2 వేగి త్రినాథ్, పార్టీ సీనియర్ నేత మలసాల కుమార్ రాజా పాల్గొన్నారు.

నిర్లక్ష్యంగా నడిపితే కఠిన చర్యలు

తుమ్మపాల: అధిక లోడుతో ప్రయాణించే క్వారీ లారీల యజమానులు, నిర్లక్ష్యంగా నడిపే డ్రైవర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ శ్రావణి హెచ్చరించారు. పట్టణంలో పోలీస్ గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన లారీ యజమానుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ పట్టణంలో తెల్లవారుజామున రైల్వే అండర్ బ్రిడ్జి ప్రమాదం క్వారీ లారీ డ్రైవర్ నిర్లక్ష్యంతోనే జరిగిందన్నారు. నిర్లక్ష్యం వల్ల ప్రమాదాలు జరగకుండా లారీ యజమానులు డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించి రవాణా నిబంధనలు, రహదారి భద్రతా నియమాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రమాదాలు నివారించేందుకు పోలీసులు మరింత కఠినంగా వ్యవహరించాలన్నారు.

గంటకు పైగా నిలిచిన ఎక్స్‌ప్రెస్ రైలు

యలమంచిలి రూరల్: క్వారీ లారీ బీభత్సంతో అనకాపల్లిలో రైల్వేట్రాక్ దెబ్బతినడంతో యలమంచిలి రైల్వేస్టేషన్‌లో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలిచిపోయాయి. మహబూబ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ రైలు గంటకు పైగా ఇక్కడ నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలు రైళ్లు ఆలస్యంగా నడవడంతో ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు తమ కార్యాలయాలకు చేరుకోవడానికి తీవ్ర హైరానా పడాల్సి వచ్చింది.

డ్రైవర్‌కు నిద్ర కరువై..

- బోల్తా పడ్డ ప్రైవేటు కంపెనీ బస్సు
- 22మందికి గాయాలు



రోడ్డు పక్కన బోల్తా పడిన బస్సు



అనకాపల్లి ఉషా ప్రైమ్ ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావు

ఎస్.రాయవరం: కేవలం మూడు గంటల విశ్రాంతి అనంతరం అదే డ్రైవర్ బస్సు నడపాల్సి రావడంతో నిద్ర సరిపోక ప్రమాదానికి దారి తీసింది. 32 మంది కార్మికులతో వస్తున్న సీసీఎల్ ప్రాసెసింగ్ పరిశ్రమకు చెందిన బస్సు సోమవారం తెల్లవారుజామున బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 22 మందికి గాయాలయ్యాయి. స్థానికులు, ఎస్.రాయవరం పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. కోటవురట్ల మండలం లింగాపురం గ్రామం నుంచి వేకువజామున సుమారు 3 గంటల ప్రాంతంలో ఈ బస్సు బయలుదేరింది. ఊరూరా కార్మికులను ఎక్కించుకొని వస్తున్న ఈ బస్సు అడ్డురోడ్డు-నర్సీపట్నం ఆర్అండ్‌బీ రోడ్డుపై పెదగుమ్ములూరు సమీపంలో పెట్రోల్ బంక్ వద్ద అదుపుతప్పి రోడ్డుపక్కన బోల్తాపడింది. ఈ ప్రమాదంలో 22మంది గాయపడగా 13 మందికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటిన ప్రయాణికులందరినీ నక్కపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. తీవ్రంగా గాయపడిన 13 మందిని అనకాపల్లి ఉషా ప్రైమ్ ఆస్పత్రికి తరలించారు. గాయాలైన 9మందికి నక్కపల్లి ఆస్పత్రిలో చికిత్స అందించారు. స్వల్పగాయాలతో బయటపడిన 10మందికి చికిత్స అందించి ఇళ్లకు పంపారు.

క్షతగాత్రులు వీరే..

కోటవురట్ల మండలం పందూరు గ్రామానికి చెందిన మానేపల్లి సత్యవతి, గొన్నాబత్తుల స్వాతి, చింతల సాయిలక్ష్మి, యర్రంశెట్టి మంగ, మారిశెట్టి భారతి, చీకట్ల నూకరాజు, సమర్ధి మహాలక్ష్మి, సరపాక సంతోషి, మారిశెట్టి హేమలత, సరమశెట్టి వరలక్ష్మి, ఎస్.రాయవరం మండలం చినగుమ్ములూరు గ్రామానికి చెందిన కోసూరి తులసి, హనుమంతు లక్ష్మి, వీరితోపాటు డ్రైవర్ షేక్ సత్తార్ తీవ్రంగా గాయపడ్డారు. నక్కపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో కాంద్రకోట నాగమ్మ దేవి, కంటే పార్వతి, చుక్క చిట్టమ్మ, బోదెపు సంధ్య, రాజపతి హేమబిందు, ఆకేటి కుమారి, షేక్ హుస్సేన్, మోటూరి నారాయణమ్మ, మానేపల్లి సత్యవతి చికిత్స పొందుతున్నారు. ప్రమాద వార్త తెలిసిన వెంటనే ఎస్.రాయవరం తహసీల్దార్ జె.రమేష్‌బాబు సంఘటన స్థలానికి చేరుకొని, ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. నక్కపల్లి ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. అడిషనల్ ఎస్పీ దేవప్రసాద్, నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు, అడ్డురోడ్డు సీఐ రామకృష్ణ అనకాపల్లి ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శించారు. బస్సు డ్రైవర్ బి షిఫ్ట్ కార్మికులను గడిచిన రాత్రి 11-12 గంటల సమయంలో ఇళ్ల వద్ద దించి, మళ్లీ తెల్లవారుజామున ఏ షిఫ్ట్ కార్మికులను తీసుకువచ్చేందుకు సిద్ధమయ్యారు. కేవలం మూడు గంటలు మాత్రమే వ్యవధి ఉండడంతో డ్రైవర్‌కు నిద్ర సరిపోక ప్రమాదానికి దారి తీసిందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

వడ్డాది వెంకన్న హుండీ ఆదాయం లెక్కింపు



వడ్డాది వేంకటేశ్వరస్వామి ఆలయంలో కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

బుచ్చెయ్యపేట : వడ్డాది వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించిన 152 కల్యాణోత్సవాలు ఘనంగా ముగిసాయి. ఈ ఉత్సవాలు సందర్భంగా ఈ నెల 10 వ తేది నుంచి 15 వరకు భక్తులు సమర్పించిన హుండీ లెక్కింపులు సోమవారం నిర్వహించారు. ఆలయ ఈవో శర్మ వారి సిబ్బందితో కలిసి లెక్కించిన హుండీ ఆదాయంలో గత ఏడాది కంటే స్వామి వారికి రూ 2,67,640 ఆదాయం అధికంగా వచ్చింది. హుండీల్లో రూ.7,86,406 నగదు వచ్చింది. టిక్కెట్ల ద్వారా రూ 4,08,665, తలనీలాల ద్వారా రూ.25వేలు, కొబ్బరి చిప్పలు వేలం ద్వారా రూ 38వేలు, ఆశీలు ద్వారా రూ 9,160, విరాళాలు ద్వారా రూ. 8435, మెత్తం రూ.12,75,666 ఆదాయం వచ్చిందని ఈవో శర్మ తెలిపారు. హుండీ లెక్కింపులో ఆలయ వంశపారంపర ధర్మకర్త దొండా కన్నబాబు, ఎస్ఐ శ్రీనివాసరావుతో పాటు స్థానిక పెద్దలు దొండా సన్యాసిరావు, దేవదాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కూలీలపై రాజకీయ కక్ష, వివక్ష



నీలిగుంటలో ఉపాధి పని కల్పించలేదని ఆరోపిస్తున్న కూలీలు

కోటవురట్ల: కూటమి ప్రభుత్వంలో ఉపాధి కూలీలపై రాజకీయ కక్ష, వివక్ష చూపిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. లింగాపురంలో పలువురు కూటమి కార్యకర్తలకు పనికి రాకుండానే మస్తర్లు పడుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. తాజాగా నీలిగుంటలో టీడీపీ కార్యకర్తలు ఉన్న గ్రూపులకు మాత్రమే పని కల్పించారంటూ కూలీలు సోమవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. నీలిగుంట, శివారు గ్రామం సన్యాసిరాజుపాలెంలో మొత్తం 18 గ్రూపులు ఉండగా అందులో ఏరికోరి టీడీపీ కార్యకర్తలున్న 4 గ్రూపులకు మాత్రమే పని కల్పించారని కూలీలు ఆరోపించారు. తమకు పని ఎందుకు కల్పించరంటూ ఉపాధి సిబ్బందిని ప్రశ్నించారు. సర్పంచ్ వరహాలబాబు మాట్లాడుతూ కూలీలపై రాజకీయం రుద్ది, పనుల కల్పనలో వివక్ష చూపిస్తున్నారని ఆరోపించారు. గతంలో కూడా మండల సర్వ సభ్య సమావేశంలో ఇదే అంశంపై అధికారులకు ఫిర్యాదు చేశామని అయినా ఉపాధి సిబ్బంది పనితీరు మారలేదని ఆరోపించారు. వెంటనే అన్ని గ్రూపులకు పని కల్పించకపోతే కూలీలతో మండల పరిషత్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

ముషిడిపల్లిలో దారి దోపిడీల కలకలం

- జంక్షన్‌కు వెళ్లే దారిలో పట్టపగలే రెచ్చిపోతున్న దొంగలు
- ఒంటరి మహిళలే టార్గెట్
- ముఖాలకు ముసుగు వేసుకొని దాడులు
- ఇప్పటి వరకూ ఆరు ఘటనలు
- బెంబేలెత్తుతున్న జనం



దారిదోపిడీ దుండగులు తిష్ట వేసిన ప్రాంతాన్ని చూపిస్తున్న బాధితుడు



దోపిడి దొంగల దాడుల పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్న ముషిడిపల్లి గ్రామస్తులు

దేవరాపల్లి : ముషిడిపల్లి గ్రామం నుంచి జమ్మాదేవిపేట జంక్షన్ వైపు వెళ్లే రహదారిలో దోపిడీ దొంగలు రెచ్చిపోతున్నారు. ఒంటరిగా వెళ్తున్న మహిళలతో పాటు పురుషులను సైతం టార్గెట్‌గా చేసుకొని పట్టపగలే దోపిడీకి పాల్పడుతున్నారు. గ్రామం నుంచి ఈ జంక్షన్ సుమారు రెండు కిలోమీటర్ల మేర దూరం ఉండడంతో పాటు జన సంచారం తక్కువగా ఉండడంతో ఈ ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకొని అటుగా వచ్చేవారిపై దాడి చేసి దోపిడీకి పాల్పడుతున్నారు. నాగారాయుడు చెరువు సమీపంలోని మలుపుల వద్ద గుర్తు తెలియని వ్యక్తులు ముఖాలకు ముసుగు వేసుకొని అటుగా వచ్చే వారిని అడ్డగించి బ్యాగుల్లో నగదుతో పాటు ఒంటిపై గల ఆభరణాలను దోచుకునేందుకు యత్నిస్తున్నారు. ప్రతిఘటించే వారిపై భౌతిక దాడులకు తెగబడుతున్నారు. సుమారు రెండు నెలల నుంచి ఈ తరహా సంఘటనలు వెలుగు చూస్తున్నాయి. ఇప్పటి వరకు ఆరుగురిపై ఈ తరహా దాడులు జరిగినట్టు సమాచారం. తాజాగా ఈనెల 11న రాత్రి 10 గంటల ప్రాంతంలో బైక్‌పై వస్తున్న యువకుడిని అడ్డుకొని దోపిడీ చేసేందుకు ప్రయత్నించారు. దీంతో ముషిడిపల్లి నుంచి జమ్మాదేవిపేట జంక్షన్ వైపు వెళ్లేందుకు మహిళలతో పాటు గ్రామస్తులు భయాందోళనలు చెందుతున్నారు. ముషిడిపల్లితో పాటు కె.ఎం.పాలెం, ఎ.కొత్తపల్లి గ్రామాల ప్రజలు ఈ రహదారి మీదుగానే ఇటు దేవరాపల్లి, అటు ఆనందపురం, అనకాపల్లి, విశాఖపట్నం వెళ్లేందుకు రాకపోకలు సాగిస్తుంటారు. ఇపుడు ఈ రహదారిలో దారిదోపిడీ ఘటనలతో ఆయా గ్రామాల ప్రజలు హడలిపోతున్నారు. కాగా ఆయా ఘటనల నుంచి తప్పించుకున్న ముషిడిపల్లి గ్రామానికి చెందిన బాధితుల తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

పట్టపగలే దోపిడీ యత్నం



నెల రోజుల క్రితం ముషిడిపల్లి నుండి ఆనందపురంలోని బట్టల షాపునకు వెళ్లేందుకు జంక్షన్ వరకు కాలినడకన బయలుదేరాను. ఉదయం 10 గంటల ప్రాంతంలో నాగారాయుడు చెరువు మలుపు వద్దకు చేరుకోగానే వెనుక నుంచి బైక్‌పై ఇద్దరు వ్యక్తులు ముఖానికి గుడ్డలు కట్టుకొని జంక్షన్ వరకు తమ బండి ఎక్కాలని కోరగా తిరస్కరించాను. దీంతో బైక్‌పై ముందున్న వ్యక్తి నా మెడలోని అర తులం బంగారు మంగళ సూత్రాలను లాగి తెంచేందుకు ప్రయత్నించాడు. వెంటనే తేరుకొని మంగళసూత్రాలను గట్టిగా పట్టుకున్నాను. బైక్ ఉన్న మరో వ్యక్తి తన చెవులకు ఉన్న బంగారు రింగ్‌లను లాగేందుకు ప్రయత్నించగా గట్టిగా చేతి గోర్లతో రక్కేయడంతో విడిచి పెట్టాడు. అదే సమయంలో ఎదురుగా వస్తున్న ఆటో డ్రైవర్ ఇది గమనించి గట్టిగా హారన్ కొట్టుకుంటూ వేగంగా రావడంతో ఇద్దరు దుండగులు బైక్‌పై పరారయ్యారు. నాకు మెడపైన, బుగ్గపై చిన్నపాటి గాయాలయ్యాయి. ప్రాణాలతో బయటపడతానని అనుకోలేదు.

-బత్తిన మంగ, బాధిత మహిళ, ముషిడిపల్లి.

ఆ ఘటన తలుచుకుంటే భయం..

సుమారు 3 వారాలు క్రితం 11 గంటల ప్రాంతంలో ముషిడిపల్లి నుంచి దేవరాపల్లి వచ్చేందుకు జంక్షన్ వరకు కాలినడకన బయలుదేరాను. నాగారాయుడు చెరువుకు సమీపంలోకి రాగానే ఇద్దరు వ్యక్తులు ముఖానికి రుమాలు కట్టుకొని వెనుక నుంచి వచ్చి తన బ్యాగ్‌ను లాగారు. దీంతో ఒక్కసారిగా వెనుకకు పడిపోయాను. అదే సమయంలో జంక్షన్ వైపు నుండి బైక్ రావడాన్ని గమనించిన దుండగులు క్షణాల్లో అక్కడి నుండి వెళ్లిపోయారు. హఠాత్తుగా జరిగిన ఈ పరిణామంతో ఊపిరి ఆగిపోయినట్లయింది. ఆ సమయంలో బైక్ రాకుంటే ఏ జరిగేదో ఊహించుకుంటేనే భయమేస్తోంది.

-డి.లోవ కుమారి, వీఆర్‌ఏ, ముషిడిపల్లి.

బైక్‌ను అడ్డగించారు..



ఈ నెల 11న రాత్రి 10 గంటల సమయంలో ఆనందపురం నుంచి ముషిడిపల్లికి బైక్‌పై ఒంటరిగా వస్తుండగా నాగారాయుడు చెరువు సమీపంలోని మలుపు వద్ద అకస్మాత్తుగా ఇద్దరు వ్యక్తులు బైక్‌కు అడ్డంగా వచ్చి ఆపేందుకు ప్రయత్నించారు. బైక్‌ను మరింత వేగంగా నడిపి తృటిలో వారు నుండి తప్పించుకున్నాను. వెంటనే గ్రామంలోకి ఫోన్ చేయగా మూడు బైక్‌లపై యువకులు వచ్చారు. ఇలా రావడాన్ని గుర్తించిన దుండగులు స్కూటీపై పరారయ్యారు. చాలా దూరం వరకు వెంబడించిన వారి ఆచూకీ లభించలేదు. వెంటనే దేవరాపల్లి ఎస్ఐకు ఫోన్ చేసి జరిగిన ఘటనను వివరించాను.

-రెడ్డి మహేష్, బాధితుడు, ముషిడిపల్లి.

ముసుగుదొంగలను పట్టుకోవాలి..



ముషిడిపల్లి నుంచి జంక్షన్‌కు వెళ్లే మార్గంలో గుర్తు తెలియని వ్యక్తులు దారి కాచి దాడులు చేస్తున్నారు. మా గ్రామానికి చెందిన ఇద్దరు మహిళలపై దాడి చేసి బంగారు నగలు, డబ్బు దోచుకోవడానికి ప్రయత్నించారు. పట్ట పగలే ఇలా దాడులు చేయడంతో జంక్షన్‌కు వెళ్లాలంటే మహిళలంతా భయాందోళనలు చెందుతున్నాం. గతంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి లేదు. పోలీస్‌లు స్పందించి అటువంటి వ్యక్తులపై నిఘా ఉంచి అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలి.

-పిల్లి పద్మ, మహిళ, ముషిడిపల్లి.

ఒంటరిగా వెళ్లొద్దని చెప్పాను...



ముషిడిపల్లి జంక్షన్‌కు వెళ్లే మార్గంలో చెరువు వద్ద గుర్తు తెలియని వ్యక్తులు దాడులు చేస్తునట్లు మా దృష్టికి వచ్చింది. ఈ దాడుల విషయమై ఐదుగురు తనకు సమాచారం అందించారు. ముషిడిపల్లి మీదుగా ప్రయాణించే ఎ.కొత్తపల్లి వాసులను కూడా అడ్డగించినట్లు మా దృష్టికి వచ్చింది. ఈ విషయాన్ని దేవరాపల్లి ఎస్ఐ గారి దృష్టికి తీసుకెళ్లాను. కానిస్టేబుల్స్‌ను పంపించారు. ఒంటరిగా వెళ్లొద్దని గ్రామస్తులకు తెలియజేశాను. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని గ్రామ పెద్దలకు కూడా తెలియజేశాను.

-లావణ్య, గ్రామ మహిళ సంరక్షణ కార్యదర్శి, ముషిడిపల్లి.

దొంగల పనిపడతాం



ముషిడిపల్లిలో రాకపోకలు సాగించే వారిని అడ్డగించి దోపిడికి యత్నిస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. స్థానిక గ్రామ సచివాలయ సంరక్షణ కార్యదర్శి కూడా మా దృష్టికి తీసుకువచ్చారు. ప్రత్యేక నిఘా పెట్టి పెట్రోలింగ్ నిర్వహిస్తున్న ఆచూకీ లభించడం లేదు. మరింత నిఘా పెట్టి అటువంటి వారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షిస్తాం.

-టి.మల్లేశ్వరరావు, ఎస్ఐ, దేవరాపల్లి

ముషిడిపల్లిలో ఆక్రమణలు తొలగించాలని రైతుల బైఠాయింపు



ముషిడిపల్లిలో ఆక్రమణలు తొలగించాలని ఆందోళన చేస్తున్న పలు గ్రామాల రైతులు

దేవరాపల్లి : మండలంలోని ముషిడిపల్లి రెవెన్యూ పరిధిలోని దుబిరెడ్డి బందతో పాటు చెరువు వాగులో అక్రమ నిర్మాణాలను తక్షణమే తొలగించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. సదరు ఆక్రమణ స్థలంలో నిర్మించిన వైన్ షాపు తదితర నిర్మాణాల ఎదుట వి.సంతపాలెం, గుడిపాల, నీలకంతరాజుపురం, జమ్మాదేవిపేట, ఆనందపురం, పోతనవలస, ఉగ్గినవలస, కృష్ణారాయుడుపేట తదితర గ్రామాల రైతులు బైఠాయించి ఆందోళన చేపట్టారు. రెవెన్యూ అధికారులు కాసులకు కక్కుర్తి పడి తప్పుడు రికార్డులను సృష్టించారని వేచలపూడి అగ్రహారానికి చెందిన వేపాడ మాజీ ఎంపీపీ వేచలపు చినరామునాయుడు ఆరోపించారు. రాజుగారి చెరువు నుంచి దుబిరెడ్డి బందకు ఇరువైపులా నీరు వెళ్లేందుకు గతంలో నిర్మించిన మదుములను కబ్జా చేశారన్నారు. చెరువు పక్కన ఉన్న గోర్జు అన్యాక్రాంతం చేశారన్నారు. రెవెన్యూ సిబ్బంది ఆక్రమణదారులతో కుమ్మక్కవ్వడంతో పలు గ్రామాలకు చెందిన రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు.ఆందోళనలో వి.ఎ స్.నాయుడు, బోజంకి అచ్యుతరామయ్య, సూర్యనారాయణ, చిరికి వెంకటరమణ, సింహాద్రప్పడు పాల్గొన్నారు.

'ఆరోపణలు నిరాధారం'

ముషిడిపల్లికి చెందిన సర్వసిద్ధి నాగేశ్వరరావు నుంచి 2013లో శ్రీకాకుళానికి చెందిన మహిళ జహర్న్‌ఖాన్ సర్వే నెంబర్ 580-2లో గల 30 సెంట్ల భూమిని కొనుగోలు చేయగా ఆమె నుంచి తాము 2022లో కొనుగోలు చేసినట్టు సోమిరెడ్డి గోవింద, గండి దేవి వివరణ ఇచ్చారు. దీనిపై రైతులు ఆర్డీవో కోర్టులో అప్పీలుకెళ్లగా విచారణ అనంతరం తిరస్కరించారన్నారు. ఆ తర్వాత 8 మంది రైతుల మీద తాము చోడవరం కోర్టుకి వెళ్లగా ఆ భూమిపై తాము తప్ప ఇతరులెవరూ వెళ్లకూడదని కోర్టు ఆదేశాలు ఇచ్చిందన్నారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం తాము భూమిని కొనుగోలు చేసుకుంటే, కొందరు రైతులను రెచ్చగొట్టి నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారన్నారు.

ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా?

- పూడిమడక రోడ్డులో భారీ వాహనాలను కట్టడి చేయాలి
- వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్, పార్టీ శ్రేణులు



తహసీల్దార్ ఆదిమహేశ్వరరావుకు వినతి అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్, పార్టీ శ్రేణులు

మునగపాక : తరచూ పూడిమడక రోడ్డులో భారీ వాహనాల (క్వారీ లారీల) రాకపోకల కారణంగా ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం తగదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ మార్గంలో అధికలోడులతో వాహనాలు ప్రయాణిస్తున్నాయన్నారు. అధికారుల ఉదాసీనత తగదంటూ మండిపడ్డారు. సోమవారం మునగపాక రెవెన్యూ కార్యాలయం వద్ద పార్టీ శ్రేణులతో కలిసి ఆందోళన నిర్వహించారు. రాంబిల్లిలోని నేవల్‌బేస్ నిర్మాణంలో భాగంగా పరిమితికి మించి భారీ బండరాళ్లతో లారీలు తిరగడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. పగలు,రాత్రి తేడా లేకుండా వాహనాలు విచ్చల విడిగా తిరుగుతున్నా అధికారులు ఎందుకు పట్టించుకోలేదన్నారు. ఇటీవల కాలంలో పూడిమడక రోడ్డులో భారీ వాహనాల కారణంగా కొంతమంది మృత్యువాతకు గురికావడం ఆందోళనకు గురిచేస్తుందన్నారు. వాహన డ్రైవర్లు నిర్లక్ష్యంగా నడపడం వల్ల నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయన్నారు. ఈ విషయమై అచ్యుతాపురం, మునగపాక మండలాలకు చెందిన ప్రజా ప్రతినిధులతో కలిసి గత ఏడాది నవంబర్ 4వతేదీన జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్‌కు వినతి అందజేసినా ఫలితం కనిపించలేదన్నారు. తక్షణమే ప్రభుత్వ ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి ప్రమాదాలు జరగకుండా చూడాలని లేకుంటే వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో దశలవారీగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావుకు వినతి అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, పార్టీ నేతలు మారిశెట్టి సూర్యనారాయణ, మలసాల కిషోర్,దాసరి అప్పారావు, మళ్ల సంజీవరావు, నరాలశెట్టి సూర్యనారాయణ, ఆడారి కాశీబాబు, దిమ్మల అప్పారావు, కోనపల్లి రామ్మోహనరావు, కాండ్రేగుల జగన్, ఈత బాబూరావు, నాగేశ్వరరావు, పెదబ్బాయి, బొడ్డేడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బుచ్చింపేటలో పశువుల పాక దగ్ధం



కాలిపోయిన పశువుల పాకను ఆర్పుతున్న రైతులు

రోలుగుంట : మండలంలోని బుచ్చింపేట గ్రామంలో సోమవారం అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన పాటూరి శ్రీరాముకు చెందిన పశువుల పాక దగ్ధమైంది. వివరాలివి. పశువుల పాక యజమాని సోమవారం మధ్యాహ్నం పొలం పాకల వద్ద పనులు ముగించుకొని భోజనానికి ఇంటికి వచ్చేశాడు. గంట తరువాత ఇతని పొలం పాకల నుంచి మంటలు వ్యాపించడంతో కుటుంబీకులతో కలసి పాక వద్దకు వచ్చి మంటలను అదుపులోకి తెచ్చుకున్నారు. ఇక్కడ ఏ విధమైన ప్రాణ నష్టం జరగలేదు, అయితే ఈ పాక సమీపంలో గల మేకల దొడ్డు కూడా కాలిపోయింది. సంబంధిత అధికారులు ఘటనా స్థలానికి వచ్చి నష్టాన్ని అంచనా వేసి పరిహారం ఇప్పించాలని బాధితుడు కోరారు.

బావిలో దూకి యువకుడి ఆత్మహత్య



మృతుడు దుర్గాప్రసాద్ (ఫైల్)

మాకవరపాలెం: వ్యవసాయ బావిలో దూకి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డారు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలాఉన్నాయి. మండలంలోని చామంతిపురం గ్రామానికి చెందిన దుంగల దుర్గాప్రసాద్ (17) గ్రామంలో వైరింగ్ పనులు చేస్తుంటాడు. అయితే బుచ్చియ్యపేట మండలం పంగిడి గ్రామానికి చెందిన వివాహితతో దుర్గాప్రసాద్‌కు పరిచయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో వీరిద్దరూ మాట్లాడుకుంటున్న విషయం వివాహిత భర్తకు తెలియడంతో దుర్గాప్రసాద్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు ఫోన్ చేసి రమ్మనడంతో భయపడిన దుర్గాప్రసాద్ ఆదివారం రాత్రి గ్రామ సమీపంలో ఉన్న వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయమై మృతుడు తల్లి రాజేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ దామోదర్‌నాయుడు తెలిపారు. మృతదేహాన్ని నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

23న ఫ్లాంట్ పరీక్ష నిర్వహణ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్, జేసీ ఎం.జాహ్నవి

తుమ్మపాల : ఈ నెల 23న జరిగే ఫ్లాంట్ (ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ – ఎసెస్‌మెంట్ టెస్ట్) పరీక్షను జిల్లా వ్యాప్తంగా విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. ఫ్లాంట్ పరీక్ష నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో సోమవారం కలెక్టరేట్‌లో ఆమెతో పాటు జేసీ ఎం.జాహ్నవి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉల్లాస్ అక్షరాస్యతా కార్యక్రమంలో భాగంగా, జిల్లాలో మహిళా స్వయంశక్తి సంఘాల్లో గల నిరక్షరాస్యులైన మహిళలను అక్షరాస్యులను చేయడానికి మొదటి దశలో 11,900 మంది అభ్యాసకులను నమోదు చేసి, 1,190 మంది అక్షరాస్యులతో అక్షరాస్యతా కేంద్రాలను ఏర్పాటు చేసి వాలంటరీ టీచర్ల ద్వారా చదువు నేర్పడం జరిగిందన్నారు. ఆయా అభ్యాసకులకు ఈ నెల 23న అంగన్‌వాడీ కేంద్రాలలో పాఠశాలలో ఫ్లాంట్ పరీక్ష నిర్వహించాలన్నారు. అంగన్‌వాడీ టీచర్, సెకండరీ గ్రేడు టీచర్ పరీక్ష నిర్వాహకులుగా వ్యవహరించాలన్నారు. వయోజన విద్యాశాఖ నుంచి పరీక్ష పేపర్లు, సంబంధిత సామగ్రి అందజేయనున్నట్టు తెలిపారు. జిల్లా, మండల స్థాయిలో సంబంధిత శాఖలు సమన్వయంతోని ఫ్లాంటు పరీక్షను నిర్వహించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో వై.సత్యనారాయణరావు, వయోజన విద్య ఉప సంచాలకుడు ఎస్.ఎస్.వర్మ, నోడల్ అధికారి డి.చిన్నికృష్ణ, డీఆర్డీఏ పీడీ కె.శచీదేవి, ఐసీడీఎస్ పీడీ కె.అనంత లక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ తనిఖీ



ఈవీఎం గోదామును పరిశీలిస్తున్న కలెక్టర్

తుమ్మపాల: ఎస్పీ కార్యాలయం ప్రాంగణంలో గల ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి విజయ కృష్ణన్ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో సోమవారం తనిఖీ చేశారు. త్రైమాసిక తనిఖీలలో భాగంగా గోదాములో భద్రపరచిన ఈవీఎం మెషీన్లను, సీసీ కెమెరాలు, అగ్నిమాపక పరికరాలు, భద్రతా ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. జిల్లా రెవిన్యూ అధికారి వై.సత్యనారాయణరావు, ఆర్డీవో షేక్ ఆయిషా, ఎలక్షన్ సెక్షన్ సూపరింటెండెంట్ ఎస్.ఎస్.వి.నాయుడు, రాజకీయపార్టీల ప్రతినిధులు టి.షణ్ముఖ్, బి.శ్రీనివాసరావు, కె.హరినాథబాబు, మీసాల సుబ్బన్న, జి.శ్రీరామ్, అగ్నిమాపక అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభం మార్పుపై ఇరువర్గాల వివాదం



ఇంటి ముందు ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం



గొయ్యి తీసిన ప్రదేశంలో మార్పు చేసే స్తంభం వేయాలని అధికారులకు చూపిస్తున్న మాజీ సర్పంచ్ లాలం లోవ

నాతవరం: ఇంటి వద్ద ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని పక్కకు మార్పు చేయడంపై ఇరువర్గాల మధ్య వివాదం నెలకొంది. జిల్లేడుపూడి గ్రామంలో లాలం నూకరాజు కొత్తగా నిర్మించిన ఇంటి గేటు ముందు విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా దర్శనమిస్తుంది. ఈ స్తంభం మార్పు చేయడం కోసం విద్యుత్ శాఖ అధికారుల ఆదేశాల ప్రకారం గత నెల 25వ తేదీన లాలం నూకరాజు విద్యుత్‌శాఖకు రూ.69,500 ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేశారు. ఈనెల 16వ తేదీన విద్యుత్ స్తంభం మార్పు చేసేందుకు జిల్లేడుపూడిలో నూకరాజు ఇంటి వద్ద సిబ్బంది పనులు ప్రారంభించారు. కొత్తగా స్తంభం ఏర్పాటుకు పాత స్తంభం తొలగించేందుకు గొయ్యి తీశారు. అయితే ఆ సమయంలో సర్పంచ్ లాలం రమణ, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు ద్వారా పనులు నిలుపుదల చేయించారు. కొత్తగా విద్యుత్ స్తంభం వేసే ప్రదేశంలో పంచాయతీ డ్రైనేజీ నిర్మిస్తామంటూ పనులను అడ్డుకున్నారు. పంచాయతీకి సమాచారం ఇవ్వకుండా ఇష్టం వచ్చినట్టు విద్యుత్ స్తంభం మార్చుకుంటే ఎలా ఊరుకుంటామని సర్పంచ్ రమణ భీష్మించారు. విద్యుత్ స్తంభం మార్పు కోసం ఆదివారం వైర్లు తొలగించడంతో గ్రామంలో సోమవారం సాయంత్రం వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో నర్సీపట్నం విద్యుత్ శాఖ ఏడీ సునీల్‌కుమార్, నాతవరం జేఈ చంద్రమౌళి సంఘటన స్థలానికి చేరుకున్నారు. అధికారుల ఎదుట ఇరుపార్టీల నాయకులు వివాదానికి దిగారు. విద్యుత్ స్తంభం వేయరాదని సర్పంచ్ రమణ, నిబంధనల మేరకు ప్రభుత్వానికి డబ్బు చెల్లించాం కాబట్టి గొయ్యి తీసిన స్థలంలో స్తంభం వేయాలని మాజీ సర్పంచ్ లోవ అధికారులపై ఒత్తిడి తెచ్చారు. దీంతో గత్యంతరం లేక అధికారులు విద్యుత్ స్తంభం మార్పును వారం రోజుల పాటు వాయిదా వేసి విద్యుత్ పునరుద్ధరించి వెళ్లిపోయారు. ఈ విషయమై ఏడీ సునీల్‌కుమార్ మాట్లాడుతూ స్తంభం మార్పుకు వినియోగదారుడు డబ్బులు కట్టారని, ఈనెల 25వ తేదీ వరకు స్తంభం మార్పుకు సమయం ఉందన్నారు. రాజకీయ నాయకులు సమస్య సృష్టిస్తే పని చేయడం కష్టమన్నారు.

కశింకోటలో సినిమా షూటింగ్ సందడి



కశింకోటలోని ఆర్‌ఈసీఎస్ ప్రధాన కార్యాలయం వద్ద బెల్లం దిమ్మెలు, చెరకు గడలతో వేసిన సెట్



పొగాకు తోరణాలు కట్టి వేసిన గుడిసె సెట్

కశింకోట: కశింకోటలోని ఆర్‌ఈసీఎస్ ప్రధాన కార్యాలయం ఆవరణలో 'అనకాపల్లి' పేరిట నిర్మిస్తున్న సినిమా చిత్రీకరణ జరుగుతోంది. నూతన నటీనటులు, దర్శకులతో దీన్ని నిర్మిస్తున్నారు. లగడపాటి విక్రం, సంధ్య హీరో, హీరోయిన్లగా దర్శకుడు కాగేష్ తొలి ప్రయత్నంగా నిర్మాణం చేపట్టారు. సినిమాలో కొంత మేర క్లైమాక్స్ దృశ్యాలను ఇక్కడ చిత్రీకరిస్తున్నారు. ఆర్‌ఈసీఎస్ కార్యాలయం వెనుక భాగంలో బెల్లం దిమ్మెల శ్రేణి, చెరకు గడలు, బెల్లం తయారీ పెనం ఏర్పాటు చేయడంతోపాటు పొగాకు తోరణాలతో అలంకరించిన గుడిసెల సెట్ వేశారు. వాటిలో రొమాన్స్‌కు సంబంధించిన దృశ్యాలను చిత్రీకరించనున్నట్టు సమాచారం. కొంత కాలంగా అనకాపల్లి పరిసర ప్రాంతాల్లో సినిమా షూటింగ్ చేస్తున్నామని, నెలాఖరుకు పూర్తి కానుందని మేనేజర్ తెలిపారు.

‘పది’ పరీక్షలు షురూ.!



పరీక్ష అనంతరం ఆటోలో ఇంటి వెళ్తున్న విద్యార్థినులు



కశింకోటలోని పరీక్ష కేంద్రం వద్ద టెన్త్ విద్యార్థుల సందడి

కశింకోట: పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మండలంలోని ఏడు కేంద్రాల్లో ఈ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 1066 మంది పరీక్షలకు హాజరు కాగా, ఐదుగురు గైర్హాజరయ్యారు. కశింకోటలోని బాలికల హైస్కూలు, డీపీఎన్ జెడ్పీ హైస్కూలు, సెయింట్ ఝాన్స్ స్కూలు, తాళ్లపాలెంలోని జెడ్పీ హైస్కూలు, ఏపీ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, నరసింగబిల్లి, కన్నూరుపాలెం హైస్కూళ్ల కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. పరీక్ష కేంద్రాలకు చుట్టు పక్కల గ్రామాల నుంచి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, బంధువులతో ఉదయం 8 గంటల నుంచే చేరుకోవడంతో సందడి వాతావరణం నెలకొంది. ఉదయం 9 గంటలకు కేంద్రాల తలుపులు తెరిచారు. ఆయా స్కూళ్ల ముందు ఏర్పాటు చేసిన బోర్డులపై తాము ఏ గదిలో పరీక్ష రాయాల్సి ఉందో తెలుసుకొని లోపలికి వెళ్లారు. మొత్తం 1071 మంది రెగ్యులర్, ప్రైవేటు విద్యార్థులు పరీక్షలకు హాజరు కావలసి ఉండగా.. ఐదుగురు గైర్హాజరయ్యారు. 1045 మంది రెగ్యులర్, 21 మంది ప్రైవేటు విద్యార్థులు పరీక్షలు రాశారు. వీరిలో ముగ్గురు దివ్యాంగ విద్యార్థులు కూడా స్క్రైబర్ల సహాయంలో పరీక్షలు రాశారు. కశింకోట స్కూళ్లలో ఇద్దరు, తాళ్లపాలెం కేంద్రంలో ఒకరు చొప్పున పరీక్షలు రాశారు. కశింకోటలోని మూడు పరీక్ష కేంద్రాలకు వెదురుపర్తి, కొత్తపల్లి, బయ్యవరం హైస్కూళ్లు, తేగాడలోని కస్తూర్బా గాంధీ విద్యాలయం, మోడల్ స్కూలు నుంచి విద్యార్థులు బస్సులు, ఆటోల్లో చేరుకున్నారు. తాళ్లపాలెం కేంద్రంలో జమాదులపాలెం, చుట్టు పక్కల హైస్కూళ్ల నుంచి విద్యార్థులు వచ్చి పరీక్షలు రాశారు. ఆయా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసి సీఐ అల్లు స్వామినాయుడు పర్యవేక్షించారు.



కశింకోట డీపీఎన్ జెడ్పీ హైస్కూలు వద్ద బోర్డుపై హాల్ టిక్కెట్ నెంబర్ చూస్తున్న విద్యార్థి



కశింకోట డీపీఎన్ జెడ్పీ హైస్కూలు కేంద్రం వద్ద 8 గంటలకు ముందే నిరీక్షిస్తున్న విద్యార్థులు

‘గురుకులం’విద్యార్థులకు ప్రత్యేక బస్సులు

తుమ్మపాల: పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల విద్యార్థులకు బీసీ సంక్షేమ గురుకులాల సొసైటీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. ఈ మేరకు పట్టణంలో మహాత్మ జ్యోతిబాపూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులను బస్సులో సోమవారం తరలించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ దేవర శెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకునేలా ప్రత్యేక బస్సు సదుపాయం కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ వైస్ చైర్మన్ కర్రి గంగాధర్, పాఠశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

కొండుపాలెంలో ఉచిత ఆటో సదుపాయం



ఆటోల్లో విద్యార్థులను పరీక్ష కేంద్రాలకు తరలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తుమ్మపాల: కొండుపాలెంలో పదో తరగతి విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకునేందుకు వైఎస్సార్ సీపీ నాయకులు ఉచితంగా ఆటోలను సమకూర్చారు. గ్రామం నుంచి ఎటువంటి బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రానికి చేరుకునేలా మూడు ఆటోలను ఏర్పాటు చేసినట్లు కో–ఆప్షన్ ఎంపీటీసీ బొండా అప్పలరాజు, పార్టీ నాయకుడు శ్రీరామ్ తెలిపారు. పరీక్షలు ముగిసే వరకు ప్రతి రోజు ఆటోల్లో విద్యార్థులను తీసుకెళ్తామన్నారు. గత మూడేళ్లుగా విద్యార్థులకు ఉచిత ఆటో సదుపాయం కల్పిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ బొండా ఉమా, వైస్ సర్పంచ్ గనిరెడ్డి అప్పారావు, కసిరెడ్డి ప్రసాద్, సాలాపు నరసింగరావు, బలిరెడ్డి రామకృష్ణ పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతి కోసం వినూత్న నిరసన



నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలంటూ ధర్నా చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

తుమ్మపాల: రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగులకు తక్షణం ఉపాధి కల్పించాలని, లేదంటే నిరుద్యోగ భృతి అందించాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వియ్యపు రాజు డిమాండ్ చేశారు. పట్టణంలో నాలుగు రోడ్ల కూడలిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం ధర్నా చేశారు. భిక్షాటన, చీపుళ్లు పట్టి రోడ్లు ఊడ్చుతూ వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులకు కూటమి నాయకులు ఇచ్చిన హామీని తక్షణమే నెరవేర్చాలన్నారు. కేంద్రంలో మూడోసారి అధికారం చేపట్టిన బీజేపీ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రతిసారి ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి యువతను మోసం చేస్తూనే ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలన్నారు. తక్షణమే మెగా డీఎస్సీతో పాటు ప్రభుత్వ శాఖల్లో వివిధ ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు జి.రాధాకృష్ణ, జిల్లా అధ్యక్షుడు వేమల కన్నబాబు, ఏఐవైఎఫ్ సహాయ కార్యదర్శి జి ఫణీంద్ర కుమార్, జగదీష్, సింహాద్రి, నవీన్, సురేష్, తరుణ్, పవన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన



ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శనను తిలకిస్తున్న అధికారులు, సిబ్బంది

కశింకోట: మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ప్రదర్శించారు. కూరగాయలు, ఆకు కూరలు, పీటి సాగుకు వినియోగించే ద్రావణాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం ప్రతినిధి కూండ్రపు అరుణ మాట్లాడుతూ కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం స్టాల్‌ను ఏర్పాటు చేసి ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను అధికారులు, సిబ్బంది, ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నామన్నారు. బీరకాయ, చిక్కుడుకాయ, బరబాటి, ఆనబకాయ, ఆకు కూరలను అధికారులు, సిబ్బంది కొనుగోలు చేశారు. ప్రకృతి వ్యవసాయానికి ఉపయోగపడే ద్రావణాలు, ఎరువులు సుందరయ్యపేటలో ఉన్న తమ కేంద్రంలో సరసమైన ధరలకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వి.వి.రవికుమార్, మండల వ్యవసాయ అధికారి ఎం.స్వప్న, మండల సర్వేయర్ రామారావు, వెలుగు ఏపీఎం పార్వతీబాయి, సీఐ అల్లు స్వామినాయుడు, ఉపాధి పథకం ఏపీవో ఎం.శ్రీనివాసరావు, ప్రకృతి వ్యవసాయం ప్రతినిధులు రమణ, గంటా అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల నిరసన ర్యాలీ



కశింకోట పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

కశింకోట: కశింకోట పంచాయతీలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు తమ వేతనాలు పెంచాలని కోరుతూ సోమవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ కార్మికుల యూనియన్(సీఐటీయూ అనుబంధం) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు కుమార్ మాట్లాడుతూ రోజుకు కార్మికుడికి రూ.400 చొప్పున వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత ఐదేళ్లుగా వేతనాలు పెంచలేదని, అధికారులకు ఈ విషయమై విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ, బీమా తదితర సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కొండబాబు, కోశాధికారి దేముడు, సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, కొల్లి రామంజి, తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా ఈకేవైసీ చేసుకోవాలి

రాంబిల్లి(అచ్యుతాపురం): రాంబిల్లి మండలంలోని రేషన్ కార్డుదారులు ఈ నెల 31వ తేదీలోగా ఈ–కేవైసీ చేయించుకోవాలని రాంబిల్లి మండల తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 31వ తేదీలోగా ఈ–కేవైసీ చేసుకున్న వారికి మాత్రమే ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి రేషన్ సరకులు బట్వాడా చేస్తామన్నారు. ఈ కేవైసీ చేసుకోని వారికి సరకుల బట్వాడా నిలిపివేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ క్రమంలో స్థానిక రేషన్ డీలర్ల దగ్గర ఈ కేవైసీ చేయించుకోవాలని కార్డు దారులకు సూచించారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు సోమవారం 7,935 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,630	4,580
మొదటి రకం	3,540	4.080
రెండో రకం	3,240	3,740
మూడో రకం	3,000	3,230

అనకాపల్లి సినిమాలు

రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్	:రాజా
ఆఫీసర్ ఆన్ డ్యూటీ	: సత్యనారాయణ స్క్రీన్-1
యుగానికి ఒక్కడు	:సత్యనారాయణ స్క్రీన్-2
కోర్ట్	:పర్శిసాయి
దిల్‌రూబా	:షిర్డీసాయి
థౌజండ్ వాలా	:వెంకటేశ్వర(ఉదయం)
న్యూ పోలీస్ స్టోరీ	:వెంకటేశ్వర (మ్యాట్నీ, 1,2 షోలు)
తండేల్	:శ్రీసత్య
ఛావా	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 84 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్–12 యూనిట్లు, బీ పాజిటివ్–32 యూనిట్లు, ఓ పాజిటివ్–34 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ య.లోకేష్‌ను ఫోన్ నంబర్ 97036 19706లో సంప్రదించవచ్చు.

డివైడర్ మూసివేతతో ట్రాఫిక్ కష్టాలు



కశింకోట కూడలిలో డివైడర్‌ను మూసివేసే పనులు చేపడుతున్న జాతీయ రహదారి సిబ్బంది



ట్రాఫిక్‌కు అంతరాయంతో నిలిచిన వాహనాలు

కశింకోట: కశింకోట కూడలిలో జాతీయ రహదారిపై డివైడర్‌ను తొలగించి విస్తరించిన మార్గం మూసివేత పనిని సోమవారం చేపట్టారు. ప్రయాణికులు, ప్రజలు, వాహన చోదకులు జాతీయ రహదారి దాటడానికి అనువుగా ఉంటుందని డివైడర్‌ను తొలగించి రోడ్డు విస్తరణకు గతంలో సన్నాహాలు చేశారు. అయితే ఇప్పుడు అధికారులు ఇక్కడ ప్రమాదకరంగా ఉందని మూసివేశారు. అయితే దీన్ని మూసి వేయకుండా వాహనాల వేగాన్ని నియంత్రించడానికి ఇక్కడ సిగ్నల్ ఏర్పాటు చేసి ప్రజలు, వాహన చోదకులు రోడ్డు దాటడానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. గంటల తరబడి నిరంతరం వాహనాల రాకపోకల రద్దీతో రోడ్డు దాటడం ప్రమాదకరంగా పరిణమించినందున, సిగ్నల్ ఏర్పాటుకు సత్వరమే అధికారులు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇదిలా ఉండగా డివైడర్ మూసివేత వల్ల రోడ్డుపై రెండు వైపులా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. దీంతో ప్రయాణికులు నానా అవస్థలు పడ్డారు.

రెండు వరి కుప్పలు దగ్ధం



పాల్తేరులో కాలిపోయిన వరి కుప్పలు

పాయకరావుపేట: మండలంలోని పాల్తేరు గ్రామ శివారున సోమవారం రెండు వరి కుప్పలు దగ్ధమయ్యాయి. కంకిపూడి వెంకట్రావు కౌలుకు తీసుకుని సాగుచేస్తున్న పొలంలో ఉన్న ఈ రెండు కుప్పలకు గుర్తు తెలియని వ్యక్తులు ఉద్దేశ పూర్వకంగా తగులబెట్టినట్లు సీఐ జి.అప్పన్న తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది సహకారంతో మంటలను ఆర్పివేశామన్నారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు క్లూస్ టీమ్‌తో దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

‘ఎంపీ రమేష్ కనుసన్నల్లోనే మైనింగ్ దందా’



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు లోకనాథం

అనకాపల్లి టౌన్: మండలంలో అక్రమ మైనింగ్ దందాలన్నీ పార్లమెంట్ సభ్యుడు సీఎం రమేష్ కనుసన్నల్లోనే జరుగుతున్నాయని, రైల్వే బ్రిడ్జి ప్రమాదానికి ఆయనే బాధ్యత వహించాలని సమాజ్ వాదీ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోన గురవయ్య యాదవ్ ఆరోపించారు. రైల్వే బ్రిడ్జి ప్రమాద స్థలాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కె.లోకనాథం నేతృత్వంలో బృందం సభ్యులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గురవయ్య మాట్లాడుతూ అక్రమ క్వారీల నుంచి అధిక లోడ్‌లో లారీలు వెళుతున్నా మైనింగ్ ఏడీ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. కూటమి నాయకుల అక్రమాలకు అడ్డూఅదుపు లేకుండా పోతుందన్నారు. అదృష్టవశాత్తూ పెను ప్రమాదం తప్పిందని, లేదంటే భారీ ప్రాణనష్టం జరిగేదన్నారు. లోకనాథం మాట్లాడుతూ ప్రమాదం జరిగిన విషయాన్ని గూడ్స్ లోకోపైలట్ గుర్తించి వెంటనే రైలును నిలిపివేయడంతో పెద్ద ప్రమాదం తప్పిందన్నారు. అదే ప్రయాణికులతో రైలు వెళ్తే భారీ నష్టం జరిగేదన్నారు. క్వారీల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా హెవీ లోడుతో లారీలను తిప్పుతున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు గంటా శ్రీరామ్, కమిటీ సభ్యులు బి.ఉమామహేశ్వరరావు, అల్లు రాజు, కె.తేలయ్యబాబు, ఎం.రమణ, నూక అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో సీపీఎం నిరసన



రాంబిల్లి ఎంపీడీవో కార్యాలయం వద్ద ఖాళీబిందెలతో వినూత్న నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

రాంబిల్లి(అచ్యుతాపురం): రాంబిల్లి మండలంలో మంచినీటి సమస్య పరిష్కరించాలంటూ సీపీఎం ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం వద్ద, జెడ్.చింతువా సచివాలయం వద్ద, కొత్తపట్నం సచివాలయం వద్ద సోమవారం ఖాళీ బిందెలతో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద ఖాళీ బిందెలతో వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం మండల నాయకుడు దేముడుబాబు మాట్లాడుతూ గత వారం రోజులుగా చేపట్టిన ప్రజా చైతన్య యాత్రల నిర్వహణ మేరకు మండలంలోని పలు సమస్యలు వెలుగులోకి వచ్చాయన్నారు. ప్రధానంగా మంచి నీటి సమస్య పరిష్కరించాలని కోరారు. మత్స్యకారులకు వేట నిషేధ సాయం, నేవల్ బేస్ నిర్వాసితులకు ప్యాకేజీ అమలు, స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ధోని కాసియా, నాగుమంత్రి నారాయణరావు, ఎరుపల్లి రాము, చెల్లూరి నూకన్న, చోడిపల్లి పవన్, చోడిపల్లి అప్పలరాజు, సీహెచ్.గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

వాడ్రాపల్లిలో పారిపల్లెమ్మతల్లి పండగ నేడు



పారిపల్లెమ్మ తల్లి

మునగపాక: వాడ్రాపల్లిలో పారిపల్లెమ్మ తల్లి పండగను మంగళవారం ఘనంగా నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ మళ్ల సంజీవరావు తెలిపారు. ఏటా మార్చిలో ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఈ ఏడాది కూడా గ్రామస్తుల సహకారంతో ఘనంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఉదయం నుంచి అమ్మవారి దర్శనానికి అవసరమైన ఏర్పాట్లు చేశామన్నారు. భక్తులకు క్యూలైన్లను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశామన్నారు. రాత్రికి గ్రామంలో పలు సాంస్కృతిక ప్రదర్శనలు, నేల వేషాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పారిపల్లెమ్మ తల్లిని దర్శించుకొని మొక్కులు తీర్చుకోవాలని ఆయన కోరారు. ఉత్సవంలో భాగంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ పి.ప్రసాదరావు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

మండుటెండలో తప్పని బడిబాట



కశింకోటలో మండుటెండలో స్కూల్‌కు వస్తున్న విద్యార్థులు

కశింకోట: పదో తరగతి పరీక్షలు ఉదయం జరుగుతున్న కారణంగా మిగతా తరగతుల విద్యార్థులు మండుటెండలో స్కూళ్లకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉష్ణోగ్రతలు పెరుగుతున్న కారణంగా ఒంటి పూట బడులు పెట్టినా ప్రయోజనం లేకుండా పోయింది. కశింకోట బాలికలు, డీపీఎన్ జెడ్పీ హైస్కూళ్లు, తాళ్లపాలెంలోని జెడ్పీ హైస్కూలు, బాలికల గురుకుల పాఠశాల, నరసింగబిల్లి, కన్నూరుపాలెం హైస్కూళ్లలో టెన్త్ పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహిస్తున్నారు. దీనివల్ల ఆయా పాఠశాలల్లో చదివే 3 నుంచి 9వ తరగతి చదివే విద్యార్థులు మధ్యాహ్నం ఒంటి గంటకు వస్తున్నారు. దీనివల్ల ఎండ తీవ్రతతో ఇబ్బంది పడాల్సి వస్తోందని వారంతా వాపోతున్నారు. పరీక్షలు ముగిసే వరకు లోపలికి ప్రవేశించే అవకాశం లేకపోవడంతో ఆరు బయట స్కూళ్ల ముందు నిరీక్షించాల్సి వస్తోంది. పరీక్షలు నిర్వహించని వెదురుపర్తి, బయ్యవరం, జమాదులపాలెం, కొత్తపల్లి, ఏఎస్ పేట హైస్కూళ్లు, మోడల్ స్కూలు, కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో మాత్రం ఉదయం పూట పాఠశాలలు నిర్వహిస్తున్నారు. టెన్త్ పరీక్షలు జరగనున్న రోజుల్లో మాత్రం మిగిలిన తరగతుల విద్యార్థులు మధ్యాహ్నం ఒంటి గంటకు స్కూలుకు రావలసి ఉంటుందని, పరీక్షలు లేని రోజుల్లో ఉదయం పూట మాత్రమే స్కూలు ఉంటుందని ఎంఈవో కె.వి.ఎస్.మూర్తి తెలిపారు.

వింత వాతావరణం



కోటవురట్లలో దట్టంగా అలుముకున్న మంచు

కోటవురట్ల: మండలంలో వింత వాతావరణంతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. మే నెల రాకుండానే సూరీడు రెచ్చిపోయి ఎండలు మండిపోతుండగా.. తెల్లవారు జామున అందుకు భిన్నంగా మంచు దట్టంగా అలుముకుంటోంది. సోమవారం తెల్లవారుజామున పొగమంచు దట్టంగా కమ్మేసింది. పంట పొలాలు, రహదారులను పొగమంచు కమ్మేయడంతో వాహనదారులు, రైతులు ఇబ్బంది పడ్డారు. 11 గంటల నుంచి ఉష్ణోగ్రతల్లో మార్పు చోటుచేసుకుని వడగాడ్పులు వీచాయి. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో జనాలు హడలెత్తిపోతున్నారు. మే నెలలో పరిస్థితిని తలచుకుంటేనే బేజారెత్తుతున్నారు.

వారపు సంత ఆదాయం రూ.16.11 లక్షలు



వారపు సంతకు వేలం నిర్వహిస్తున్న అధికారులు

నక్కపల్లి: మండల పరిషత్, నక్కపల్లి పంచాయతీ సంయుక్త నిర్వహణలో ఉన్న వారపు సంతకు రూ.16.11 లక్షల ఆదాయం లభించింది. సోమవారం 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను సంతలో ఆశీలు వసూలు చేసుకునే హక్కుకు సంబంధించి బహిరంగ వేలం నిర్వహించారు. ఈ వేలం పాటలో 28 మంది పాల్గొన్నారు. నక్కపల్లికి చెందిన దేవవరపు కొండలరావు హెచ్చు పాటగా రూ.16,11,000లకు దక్కించుకోవడంతో కొండలరావుకు ఆశీలు వసూలు చేసుకునే హక్కు కల్పిస్తూ మండల పరిషత్ అధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. గత ఏడాది కంటే రూ.28 వేలు అధికంగా ఆదాయం లభించిందని ఎంపీడీవో సీతారామరాజు తెలిపారు. అలాగే హ్యాండ్‌పంప్ ఓల్డ్ స్క్రాప్‌కు నిర్వహించిన వేలంలో రూ.2.07 లక్షలు ఆదాయం లభించింది. వీటిని వెలగా రమేష్ అనే వ్యక్తి పాడుకున్నట్లు ఎంపీడీవో చెప్పారు. ఈ వేలంలో వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు కల్పించాలని వినతి



సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

అచ్యుతాపురం రూరల్ : ఉపాధి హామీ పనులు కల్పించాలని తిమ్మరాజుపేట సచివాలయం సిబ్బందికి సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. సోమవారం తిమ్మరాజుపేట సచివాలయం వద్ద మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు ప్రతి పేద కుటుంబానికి 100 రోజులు ఉపాధి కల్పించాలని ధర్నా చేశారు. అనంతరం సచివాలయం సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబానికి వంద రోజుల ఉపాధి పని కల్పించాలని చట్టం చెబుతున్నా నేటికీ తిమ్మరాజుపేట గ్రామంలో అమలు కావడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ అచ్యుతాపురం కన్వీనర్ రొంగలి రాము, మండల నాయకులు కూండ్రపు సోమునాయుడు, నడుపూరు సన్యాసిరావు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

విద్యార్థులకు గాయిటర్ స్క్రీనింగ్ పరీక్షలు



విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి సుభాష్

పాయకరావుపేట: నేషనల్ అయోడిన్ డెఫిషియెన్సీ డిజార్డర్స్ కంట్రోల్ ప్రోగ్రాంలో భాగంగా విద్యార్థులకు గాయిటర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించినట్టు పాయకరావుపేట పీహెచ్‌సీ వైద్యాధికారి సుభాష్ తెలిపారు. జెడ్పీ బాలికలు ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఎంపీపీ పాఠశాలల్లో 90 మంది విద్యార్థులకు సోమవారం పరీక్షలు నిర్వహించారు. పలువురి విద్యార్థుల యూరిన్ శాంపిల్స్ తీసి డీఎంహెచ్‌వో కార్యాలయానికి పంపించినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌వో పి.వి.రమణ, హెల్త్ సూపర్‌వైజర్ నాగేశ్వరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.